

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మధురానగర్ సంక్షేమ సమితి ప్రతినిధులు, కాలనీ వాసులు

మధురానగర్ అభివృద్ధిలో మాగంటి కృషి మరవలేం

పంజాగుట్ట, జూన్8 (ఆంధ్రజ్యోతి): మధురానగర్ కాలని అభివృద్ధిలో జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్టీ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపీనాథ్ కృషి మరవలేనిదని మధురానగర్ సంక్షేమ సమితి ప్రధాన కార్యదర్శి కోడె సాంబశివరావు అన్నారు. ఆయన మృతి తీరని లోటని తెలిపారు. ఆదివారం కాలనీలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో అనారోగ్యంతో మృతి చెందిన ఎమ్మెల్యే గోపీనాథ్ చిత్రపటానికి సమితి ప్రతినిధులు, కాలనీ వాసులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో సమితి కోశాధికారి సుగుణ, విశ్వప్రకాశ్, కళ్యాణ్ చక్రవర్తి, ఉప్పలయ్య, శేషాచారి,సుష్మ, సుధాకర్, శ్రీనివాస్, నాగేశ్వరరావు, రాజేంద్రప్రసాద్, సాయి రఘు, కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు దేవిరెడ్డి నాగార్జున రెడ్డి, వెంగళరావునగర్ సంక్షేమ సమితి అధ్యక్షుడు చిలకల వెంకటేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

బెదిరింపులకు పాల్పడుతున్న యువకుడి అరెస్ట్

బంజారాహిల్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): బెదిరింపులకు పాల్పడుతున్న యువకుడ్ని ఫిలింనగర్ పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసి రిమాండ్ తరలించారు పోలీసుల వివరాల ప్రకారం.. అత్తాపూర్‌లో నివసించే ఇర్ఫాన్ హుస్సేన్ 21 బీబీఏ చదువుతున్నాడు. ఆరేళ్ల క్రితం మాసబ్ ట్యాంకు అపార్ట్‌మెంట్లో ఉసామా హుస్సేన్‌తో కలిసి ఉండేవాడు. ఇద్దరు కలిసి దందాలకు పాల్పడడమే కాకుండా పోలీస్ స్టేషన్‌కు వచ్చే కేసులను పరిష్కరిస్తామని నమ్మిస్తూ పలువురి వద్ద నుంచి డబ్బులు వసూలు చేస్తున్నారు. ఇందులో భాగంగానే ఐదు రోజుల క్రితం ఫిలింనగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి కేసులో రాజేంద్ర అనే వ్యక్తి కుమారుడు స్వయంభూ అనే యువకుడ్ని కేసు నుంచి తప్పిస్తామని నమ్మించి రూ.10వేలు ఇర్ఫాన్ తన ఖాతాలో వేసుకున్నాడు. కాగా ఆ కేసులో డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని మోసపోయానని తెలుసుకొన్న అతడు రాజేంద్రనగర్ పోలీసులకి ఫిర్యాదు చేశాడు. దీంతో పోలీసులు ఇర్ఫాన్ హుస్సేన్ ను అరెస్ట్ చేసి రిమాండ్ తరలించగా ఉసామా హుస్సేన్ పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో ఉసామా హుస్సేన్, శ్రీనివాస్ రెడ్డి అనే మరో ఇద్దరు నిందితుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.



కార్యాలయం ప్రారంభం అనంతరం మాజీ కార్పొరేటర్ కృష్ణయాదవ్‌తో అధ్యక్షుడు కుమార్‌యాదవ్ తదితరులు

యాదవ సంఘం కొత్త కార్యాలయం ప్రారంభం

ఖైరతాబాద్, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఖైరతాబాద్ యాదవ సంఘానికి కొత్త కార్యాలయం ప్రారంభమయ్యింది. ఆదివారం ఖైరతాబాద్ మాజీ కార్పొరేటర్ జి.కృష్ణ యాదవ్ ఇటీవలే కొత్తగా ఎంపికైన అధ్యక్షుడు కంటిబోయిన కుమార్ యాదవ్, కార్యవర్గ సభ్యులతో కలసి కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కృష్ణ యాదవ్ మాట్లాడుతూ, యాదవులు హక్కుల సాధనకు కృషి చేయాలని కోరారు. ఇందులో యాదవ సంఘం కార్యనిర్వాహక అధ్యక్షుడు మానుక పాండు యాదవ్, సలహాదారుడు లక్ష్మణ్ యాదవ్, ప్రధాన కార్యదర్శులు మారబోయిన వెంకటేష్, రాజు యాదవ్, గంగాధర్ యాదవ్‌లతో పాటు గ్రేటర్ హైదరాబాద్ యాదవ సంఘం అధ్యక్షుడు బోయిని వెంకటేష్ యాదవ్, ప్రధాన కార్యదర్శి బోడి అనుయాదవ్, ఉపాధ్యక్షుడు, తదితరులు పాల్గొన్నారు.



మహంత్ నిత్యగోపాల్ దాస్ ఆశీర్వాదం తీసుకుంటున్న మణిదీప్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మణిదీప్

అయోధ్యలో నిత్యగోపాల్‌దాస్‌ను కలిసిన మణిదీప్

ఖైరతాబాద్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): అయోధ్య రామ జన్మభూమి తీర్థ క్షేత్ర ట్రస్టు, మధుర కృష్ణజన్మభూమి క్షేత్ర ట్రస్టు అధ్యక్షుడు మహంత్ శ్రీ నిత్య గోపాల్ దాస్‌ను మణిదీప్ ఛారిటబుల్ ట్రస్టు అధ్యక్షుడు మణిదీప్ అయోధ్యలో కలిసి ఆశీర్వాదం తీసుకున్నాడు. మహంత్ జన్మదినం సందర్భంగా బీహార్ ఉప ముఖ్యమంత్రి విజయ్‌కుమార్ సిన్హా సైతం ఆయన ఆశీర్వాదం తీసుకున్నారు. సనాతన ధర్మం పరిరక్షణలో నిత్యగోపాల్ దాస్ కృషి అమోఘమైనదని, నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకొని ఆయన ఆశయాలను సాధించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉన్నదని మణిదీప్ తెలిపారు.



కుండలపై అద్భుతంగా నృత్యం చేస్తున్న చిన్నారులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం : నరేంద్ర బంధు

బేగంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగా ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని నిర్మల సాధన జ్యోతి మందిర్ వ్యవస్థాపకులు, యోగా గురువు నరేంద్ర బంధు అన్నారు. నిర్మల్ సాధన జ్యోతి మందిర్ భగత్‌సింగ్ పార్క్ బ్రాంచ్ వార్షికోత్సవాలు సనత్‌నగర్‌లోని భగత్‌సింగ్ పార్క్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరేంద్ర బంధు దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం పార్కులో యోగాసనాలు వేశారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అబ్బురపరచాయి. ప్రధానంగా చేతుల్లో క్యాండిల్ దీపాలు పెట్టుకొని కుండలపై నృత్యాలు చేస్తూ చేసిన నృత్యాలు అందరినీ కట్టిపడేశాయి. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ, యోగాను ప్రతీ ఒక్కరూ నేర్చు కోవడంతో పాటు ఇతరులకు ఉచితంగా నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జీ తిలోక్ నాథ్, యోగా టీచర్లు మాధురి, ప్రసాద్, భూషణ్, యోగేష్ తదితరులు పాల్గొన్నారు.



యోగా సాధన కార్యక్రమంలో పాల్గొన్న యోగ గురువు నరేంద్ర బంధు



కళ్యాణ్‌నగర్‌లో థీమ్ పార్కును ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ (ఫైల్)



రహ్మత్‌నగర్‌లో దళిత్ స్టడీ సర్కిల్



కమలానగర్‌లో డబుల్ బెడ్‌రూం సముదాయం

జూబ్లీహిల్స్ రాజకీయాల్లో చెరగని ముద్ర

నియోజకవర్గ అభివృద్ధికి మాగంటి కృషి

స్థానికులకు చేరువయ్యేందుకు కానుకలు, విందులు

బంజారాహిల్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ప్రజలకు అందుబాటులో ఉండటమే కాకుండా సమస్యల పరిష్కారంలో అభివృద్ధి విషయంలో దివంగత ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో తనదైన ముద్ర వేశారు. ఆయన పనితీరుపై కొందరు పనిగట్టుకొని విమర్శలు చేసినా వాటిని పట్టించుకోకుండా ప్రజా సంక్షేమం, నియోజకవర్గం అభివృద్ధే లక్ష్యంగా ముందుకు సాగారు. సంక్షేమ పథకాల పంపిణీ అయినా.. సొంత బహుమతులైన నేరుగా ప్రజలను కలుస్తూ వారి సమస్యలు వింటూ తనదైన శైలితో నియోజవర్గంలో ఆయన చెరగని ముద్ర వేశారు. పునర్విభజనలో భాగంగా 2009లో జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఏర్పడింది. అంతకుముందు ఇక్కడి మెజార్టీ ప్రాంతాలు ఖైరతాబాద్ అసెంబ్లీ పరిధిలో ఉండేవి. దివంగత పీజేఆర్ ఖైరతాబాద్ నియోజకవర్గంపై తనదైన ముద్ర వేయగా.. హ్యాట్రిక్ ఎమ్మెల్యేగా జూబ్లీహిల్స్ నియోజకవర్గం అభివృద్ధికి మాగంటి విశేష కృషి చేశారు. బస్తీలను మోడల్‌గా తీర్చిదిద్దాలని ఆయన లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈ నేపథ్యంలో కార్మిక నగర్‌లో ఉన్న రోడ్డును అభివృద్ధి చేసే భాగంలో అక్కడ ఉన్న గుడిసె వాసులందరికీ పక్కా గృహాలను మంజూరు చేయించి పేదల పెన్నిధిగా పేరు సంపాదించారు. ఇరుకుగా ఉన్న కార్మికుల రోడ్లు కాస్త విశాలంగా అవడంతో పాటు మంచి వాతావరణం ఏర్పడింది.

క్వారీ స్థలం అన్యాక్రాంతం కాకుండా..

రహమత్‌నగర్ డివిజన్‌లో కోట్ల రూపాయల విలువ చేసే క్వారీ స్థలం ఎకరాల కొద్దీ ఉండేది. స్థానిక నాయకులు క్రమంగా క్వారీ స్థలాలను ప్లాట్లుగా చేసి అమ్మేశారు. గోపీనాథ్ ఎమ్మెల్యేగా గెలిచిన సమయానికి చాలా స్థలం అన్యాక్రాంతమైంది. ఉన్న స్థలాన్ని పరిరక్షించాలని భావించినా ఆయన ఆయా స్థలాల్లో అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. నియోజకవర్గంలో యువకులను క్రీడల్లో ప్రోత్సహించేందుకు రెండెకరాల క్వారీ స్థలంలో విశాలమైన క్రీడా మైదానాన్ని అభివృద్ధి చేశారు. దీనికి సమీపంలోనే ఏసీ ఫంక్షన్ హాల్, దళిత్ భవన్ నిర్మించడంతోపాటు మిగిలిన స్థలంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల నిర్మాణం చేపట్టాలని ప్రతిపాదన చేశారు. బోరబండ సైట్ త్రీలో కూడా ఉన్న ప్రభుత్వ స్థలాన్ని పరిరక్షించేందుకు ఆయన నిరంతరం శ్రమించారు.

మంచినీటి సమస్య పరిష్కారం కోసం

నియోజకవర్గంలో మంచినీటి సమస్య శాశ్వత ప్రాతిపదికన పరిష్కరించేందుకు మాగంటి ప్రణాళికలు సిద్ధం చేశారు. నియోజకవర్గంలో నాలుగు వైపులా రిజర్వాయర్లు నిర్మిస్తే మంచినీటి సమస్య ఉండదని ఇందుకు తగ్గట్టుగా అనువైన ప్రభుత్వ స్థలాలను అన్వేషించడం మొదలు పెట్టారు. ఈ క్రమంలో ఎస్‌పీఆర్ హిల్స్‌లో రిజర్వాయర్‌కు ఆయన శంకుస్థాపన చేశారు. సుమారు రెండేళ్లపాటు పనులు సాగాయి. ఇటీవలె ప్రభుత్వం ఈ రిజర్వాయర్‌ను అందుబాటులోకి తీసుకువచ్చింది. పలు బస్తీల్లో ప్రత్యేకంగా పైప్‌లైన్‌లు నిర్మించేందుకు పలుమార్లు అప్పటి మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్‌ను కలిసి ప్రత్యేక నిధులు మంజూరు చేయించుకున్నారు. నాలా పరివాహక ప్రాంతాల వారికి ఇబ్బందులు కలుగకుండా స్లాబ్‌లు నిర్మించారు. కాలనీ వాసులతో మమేకమవుతూ సమస్యలను పరిష్కరించారు.

సంక్షేమ పథకంతో పాటు బహుమతి

ప్రభుత్వ సంక్షేమ పథకాల అమలు విషయంలో కూడా మాగంటి ప్రత్యేక శ్రద్ధ తీసుకున్నారు. పేదలందరికీ పథకాలు అందేలా కృషి చేశారు. ఎవరికి ఇటువంటి సమస్య వచ్చినా తానున్నానంటూ ముందుకు రావడమే కాకుండా తన వంతు సహాయం అందించే వారు. సంక్షేమ పథకాల పంపిణీ సమయంలో లబ్ధిదారులను మరింత సంతోషపెట్టేందుకు ఆయన తన సొంత డబ్బుతో బహుమతులు కూడా అందజేసే వారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం, బతుకమ్మ వంటి ఉత్సవాలను నియోజకవర్గంలో పది రోజుల పాటు నిర్వహించడమే కాకుండా హాజరైన ప్రతీ మహిళకు వంటింట్లో ఉపయోగపడే వస్తువులను బహుమతిగా ఇవ్వడం ఆయన ఆనవాయితీగా పెట్టుకున్నారు. ఈ బహుమతుల గురించి ఎక్కడా ప్రచారం నిర్వహించుకోకుండా.. నేరుగా ప్రజల వద్దకే వెళ్లి అందజేసేవారు. ఇలా ప్రతి గడపతో ఆయన అనుబంధం ఏర్పరచుకున్నారు.

కమలానగర్‌లో డబుల్ బెడ్ రూమ్‌లు

జూబ్లీహిల్స్ ఎంపీ ఎమ్మెల్యే కాలనీ ఆనుకొని ఉన్న కమలానగర్‌లో డబుల్ బెడ్ రూములు నిర్మిస్తే పేదలకు మేలు జరుగుతుందని ఎమ్మెల్యే మాగంటి భావించారు. అయితే గతంలో కూడా ఇక్కడ ప్రభుత్వ పక్కా గృహాలు నిర్మించేందుకు అప్పటి పాలక ులు ప్రయత్నించినప్పటికీ స్థానికులు ఒప్పుకోలేదు. కానీ మాగంటి తనదైన శైలిలో బస్తీ వాసులను ఒప్పించి మెప్పించారు. అనంతరం ప్రభుత్వం నుండి నిధులు మంజూరు చేయించి డబుల్ బెడ్ రూమ్‌లను పూర్తిచేసి స్థానికులకు అప్పగించారు. ఈ డబుల్ బెడ్ రూమ్‌లతో ఆయన తనకంటూ ఓ ప్రత్యేక గుర్తింపును తెచ్చుకోగలిగారు. సిద్ధార్థ నగర్‌లో అన్యాక్రాంతమవుతున్న పార్కును జీహెచ్ఎంసీ అధికారులతో పోరాడి జలమండలి శాఖను అనుసంధానం చేసుకుంటూ థీమ్ పార్క్‌ను ఏర్పాటు చేసిన ఘనత మాగంటికి దక్కుతుంది.



ఎస్‌పీఆర్ హిల్స్‌లో వాటర్ ట్యాంకర్



నివాళులర్పిస్తున్న కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్



మాగంటి గోపీనాథ్ పార్థీవ దేహాన్ని సందర్శించి నివాళులర్పిస్తున్న కార్పొరేటర్లు సీఎన్ రెడ్డి, దేదీప్యరావు

తరలివచ్చిన బీఆర్ఎస్ శ్రేణులు

- మాదాపూర్ నివాసం నుంచి

మహాప్రస్థానం వరకు అంతిమ యాత్ర

బంజారాహిల్స్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): జన నేతకు బీఆర్ఎస్ శ్రేణులు, అభిమానులు ఘనంగా నివాళులర్పించారు. కంటతడి పెడుతూ తుది వీడ్కోలు పలికారు. మాదాపూర్ వసంత ఎన్‌క్లేవ్‌లోని మాగంటి నివాసానికి తరలి వచ్చారు. యూసుఫ్‌గూడ కార్పొరేటర్ రాజ్‌కుమార్‌గౌడ్, వెంగళరావునగర్ కార్పొరేటర్ దేదీప్యరావు, జూబ్లీహిల్స్ కార్పొరేటర్ వెల్దండ వెంకటేష్, వెంకటేశ్వరనగర్ కార్పొరేటర్ మన్నె కవితారెడ్డి, ఇతర సీనియర్‌నాయకులు ఉదయం నుంచి ఏర్పాట్లను పర్యవేక్షించారు. మాజీ క్రికెటర్ అజారుద్దీన్, కార్పొరేటర్ సీఎన్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు శ్యాంరావు, సంజయ్‌గౌడ్, మామిడి నర్సింగరావు, కాంగ్రెస్ నాయకుడు నవీన్‌యాదవ్, ఖైరతాబాద్ బీఆర్ఎస్ ఇన్‌చార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి, కేకే కుమారుడు విప్లవ్‌కుమార్ తదితరులు మాగంటి భౌతిక కాయానికి నివాళులర్పించారు.

బాబాకు వ్యతిరేకంగా నినాదాలు

మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ నివాళులర్పించి తిరిగి వెళుతున్న సమయంలో అక్కడే ఉన్న బీఆర్ఎస్ శ్రేణులు బోరబండ కార్పొరేటర్ బాబాఫసీయుద్దీన్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. బోరబండను బాబా నుంచి కాపాడాలంటూ డిమాండ్ చేశారు. దీంతో కొద్ది సేపు ఉద్రిక్తత నెలకొంది. కేటీఆర్‌తో కొంత మంది మహిళలు మాట్లాడుతూ గోపన్న లేడు మాకు దిక్కెవరు అంటూ రోదించారు. కల్వకుంట్ల కవిత వచ్చినప్పుడు మహిళలు తమ ఆవేదన వెల్లబోసుకోగా ఆమె వారిని ఓదార్చారు.



బోరబండ బలహీన వర్గాల కాలనీలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

భారీ ర్యాలీ

మాదాపూర్ వసంతనగర్ నివాసం నుంచి భౌతిక కాయాన్ని భారీ ర్యాలీగా మహాప్రస్థానంకు తీసుకువెళ్లారు. దారి వెంబడి గోపన్న అమర్ రహే అంటూ కార్యకర్తలు నినాదాలు చేశారు. జూబ్లీహిల్స్ నీరూస్, చెక్‌పోస్టు, ఫిలింనగర్‌చౌరస్తా మీదుగా అంతిమ యాత్ర జరిగింది.

అన్ని పండుగలకు సమాన విలువలనిచ్చే మాగంటి

బంజారాహిల్స్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని ప్రతి ఇంటిలో ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ జ్ఞాపకం ఉంది. పార్టీలతో సంబంధం లేకుండా పండుగ వస్తే చాలు.. ప్రతి ఒక్కరికి ఆయా పండుగలను నిర్వహించి బహుమతులు అందించే వారు. రంజాన్‌లో మాగంటి హడావుడి చేసేవారు. ముస్లీంలతో ప్రార్థనలలో పాల్గొనడంతో పాటు డివిజన్‌ల వారీగా ఇఫ్తార్ ఏర్పాటు చేసి బహుమతులు అందచేసేవారు. క్రిస్మస్ వచ్చినప్పుడు ప్రార్థనలు చేయడంతో పాటు ఎస్పీఆర్ హిల్స్ గ్రౌండ్స్‌లో సుమారు 20 వేల మందికి భారీ విందు ఏర్పాటు చేయడం అనవాయితీగా పెట్టుకున్నారు.

కరోనాలో ప్రజలకు అండగా..

కరోనా సమయంలో పేదలకు అండగా నిలవాలని మాగంటి భావించారు. తన క్యాంపు కార్యాలయంలో వంటశాల ఏర్పాటు చేశారు. రోజుకు కనీసం 4000-5000 మందికి సరిపడా ఆహారం సిద్ధం చేసే వారు. తలసేమియా అసోసియేషన్‌తో కలిసి కోట్ల విజయభాస్కర్‌రెడ్డి స్టేడియంలో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. గోపీనాథ్‌పై అభిమానంతో రికార్డు స్థాయిలో కార్యకర్తలు, అభిమానులు రక్తదానం చేశారు. ఒక్కరోజులో అత్యధిక మంది రక్త దానం చేయడంతో ఇండియా బుక్ ఆఫ్ రికార్డ్సులో చోటు సంపాదించారు.

శ్రీనివాస కల్యాణం

కేసీఆర్ జన్మదినం వస్తే చాలు నియోజకవర్గంలో పెద్ద వేడుక జరుగుతుంది. నగరంలో ఎవరూ నిర్వహించని విధంగా మాగంటి రెండు మార్లు శ్రీనివాస కల్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. యూసుఫ్‌గూడ గ్రౌండ్‌లో సినిమా సెట్టింగ్‌ను తలపించేలా మండపం.. అందులో చిద్విలాసంగా ఉన్న దేవతా మూర్తులను ప్రతిష్ఠించి తిరుమల తిరుపతి నుంచి ప్రత్యేకంగా అర్చకులను పిలిపించి కల్యాణం జరిపించేవారు. ఈ వేడుకను చూసేందుకు నగర వాసులు, సినీ, రాజకీయ ప్రముఖులు వచ్చి వీక్షించేవారు.



రన్‌లో ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డితో నిర్వాహకులు, అతిథులు



రన్‌లో పాల్గొన్న ప్రతినిధులు

ఉత్సాహంగా 'తెలంగాణ రన్'..

ఖైరతాబాద్, జూన్8 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య తెలంగాణను సాధించే ఉద్దేశ్యంతో సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ ఆధ్వర్యంలో ఐమాక్స్ పక్కనున్న హెచ్ఎండీఏ ఖాళీ స్థలం నుండి జరిగిన తెలంగాణ రన్ ఉత్సాహంగా సాగింది. 3కే, 5కే, 10కేతో పాటు హాఫ్ మారథాన్ విభాగాల్లో జరిగిన ఈ రన్‌లో దాదాపు 2,500 మంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఒలింపిక్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ అధ్యక్షుడు, మాజీ ఎంపీ జితేందర్‌రెడ్డి, అవంతిక నిర్మాణ సంస్థ ఎండీ యెన్నం శ్రీనివాస్ రెడ్డి, ఎంఎల్ఆర్ గ్రూప్ ఆఫ్ ఇనిస్టిట్యూషన్స్ ఛైర్మన్ మర్రి లక్ష్మణ్‌రెడ్డితో కలిసి ప్రారంభించారు. క్రీడల ద్వారానే ఆరోగ్య తెలంగాణ సాధ్యమవుతుందని, చిన్నప్పటినుండే పిల్లలకు నచ్చిన క్రీడలో శిక్షణ ఇప్పించాలని కోరారు. రన్‌లో నగరవాసులే కాక ఇతర నగరాలు, ఇతర రాష్ట్రాల నుండి పెద్ద ఎత్తున రన్నర్స్ వచ్చారు. విజేతలకు నగదు బహుమతులతో పాటు మెడల్స్‌ను అందజేశారు. ఇందులో సొసైటీ ఫర్ తెలంగాణ రన్నర్స్ అధ్యక్షుడు డాక్టర్ సోమ జగన్‌మోహన్‌రెడ్డి, ప్రతినిధులు పన్నాల హరీష్ చంద్ర రెడ్డి, శ్రీనివాస్ మగ్గారి, శ్రీకాంత్ తాడూరి, డాక్టర్ మహేష్, రవి, రాజు సతీష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో సావనీర్‌ను ఆవిష్కరిస్తున్న కార్పొరేటర్ విజయారెడ్డి

అక్షరాస్యతకోసం వయోజన విద్యాశాఖ కృషి అమోఘం

ఖైరతాబాద్, జూన్8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో వయోజనవిద్యతో పాటు అక్షరాస్యత పెంపునకు వయోజన విద్యాశాఖ చేస్తున్న కృషి అభినందించదగినదని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ విజయారెడ్డి అన్నారు. ఆదివారం తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల వయోజన విద్యావిభాగం విశ్రాంత ఉద్యోగుల సంఘం ఆత్మీయ సమ్మేళనం ఖైరతాబాద్ బ్రైట్ వెల్ఫేర్ అసోసియేషన్ హాల్‌లో జరిగింది. దీనికి విజయారెడ్డి అతిథిగా హాజరై సీనియర్ ఉద్యోగులను సత్కరించారు. గౌరవ అతిథిగా చావా సుబ్బారావు పాల్గొనగా కార్యక్రమ కన్వీనర్‌గా సుభాష్, అధ్యక్షుడిగా తాటి వీరేశం వ్యవహరించారు.



చెక్కులందుకున్న విద్యార్థులతో జస్టిస్ మాధవీలత, వాసవీ ప్రతినిధులు

400 మంది విద్యార్థులకు స్కాలర్‌షిప్పులు

ఖైరతాబాద్, జూన్8 (ఆంధ్రజ్యోతి): భోజనం పెట్టే కంటే సంపాదించే మార్గాన్ని నేర్పించడం మంచిదని, దీనివల్ల తక్షణ అవసరాలే కాక దీర్ఘకాలిక ప్రయోజనాలు కలిగి కొన్ని కుటుంబాలు ఎదిగేందుకు దోహదపడతాయని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మాధవీలత అన్నారు. ఆదివారం ఖైరతాబాద్ వాసవీ సేవాకేంద్రం ఆధ్వర్యంలో విద్యా సహాయ నిధి ద్వారా 400 మంది పేద పాఠశాల విద్యార్థులకు స్కాలర్‌షిప్పులతో పాటు ఎడ్యుకేషన్ కిట్లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన మాధవీలత మాట్లాడుతూ పిల్లల భవిష్యత్తు పట్ల స్కూళ్ళు, తల్లిదండ్రులే కాక సమాజం బాధ్యతగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో వాసవీ సేవా కేంద్రం అధ్యక్షుడు కొల్పూరుదయక్కుడు అలంపల్లి రవికుమార్,

కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి

సికింద్రాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో కాంగ్రెస్ పార్టీ పటిష్ఠతకు కృషి చేస్తున్నామని, దీనిలో భాగంగా అంకితభావంతో పని చేసే కార్యకర్తలకు సముచిత పదవులు దక్కుతాయని స్థానిక శాసనసభ్యుడు ఎస్.శ్రీగణేష్ తెలిపారు రెండో వార్డుకు చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్యాంసన్‌రాజుతోపాటు పలువురు నాయకులు, కార్యకర్తలు ఆయనను కలిశారు. తమకు పార్టీ పదవుల్లో, నామినేటెడ్ పదవుల్లో అవకాశం కల్పించాలని కోరారు. దీనికి శ్రీగణేష్ స్పందిస్తూ ఏళ్ల తరబడి పార్టీ జెండా మోసిన కార్యకర్తల కఠోర శ్రమ వృథా పోదని, అన్ని వార్డుల నాయకులు, కార్యకర్తలు దరఖాస్తులు సమర్పిస్తే అనువైన పదవులు దక్కేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.


మందులు అందజేస్తున్న యస్ఐ జ్ఞానేశ్వర్

ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

చిలకలగూడ, జూన్8 (ఆంధ్రజ్యోతి): చిలకలగూడ, దూద్‌బావి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆదివారం జనహిత సేవా ట్రస్ట్, కిమ్స్ ఫౌండేషన్, అమన్ వేదిక ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన చిలకలగూడ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్‌స్పెక్టర్ జ్ఞానేశ్వర్ లాంఛనంగా ప్రారంభించి అనంతరం మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్యంపై పట్ల శ్రద్ధ వహించాలని అన్నారు. ఈ శిబిరంలో 150మందికి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన మందులు అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు మల్లిఖార్జునరెడ్డి, అమన్ వేదిక ప్రతినిధులు ఎల్లయ్య, రాజు, రామస్వామి, జనహిత క్యాంపు కోఆర్డినేటర్ బి.నరసింగరావు, కిమ్స్ ఫౌండేషన్ కో ఆర్డినేటర్ జె.విక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ ఉపాధ్యక్షురాలి నియామకం


వసంత నాయక్

అడ్డగుట్ట, జూన్ 8(ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్ నియోజకవర్గం అడ్డగుట్ట డివిజన్ భారతీయ జనతా పార్టీ ఉపాధ్యక్షురాలిగా అడ్డగుట్ట లంబాడిబస్తీకి చెందిన వసంత నాయక్ నియమితులయ్యారు. ఇటీవల నూతన కార్యవర్గంలో ఆమెకు చోటు లభించింది. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తన తండ్రి పెంటయ్య నాయక్ రాజకీయాల్లో కీలక వ్యక్తిగా ఉండేవారని తెలుగుదేశం పార్టీలో చురుకుగా పనిచేసి ఎస్టీ కార్పొరేషన్ ఛైర్మన్‌గా పనిచేసిన తండ్రి అడుగుజాడలో నడుస్తానని అన్నారు. తనకు ఈ బాధ్యత అప్పగించిన బీజేపీ అడ్డగుట్ట డివిజన్ అధ్యక్షురాలు గాజుల సౌందర్య, హంసరాజులతో పాటు బీజేపీ ముఖ్య నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీలో చురుకుగా పాల్గొంటూ సంక్షేమ పథకాలు ప్రజల్లోకి చేరేలా చైతన్యం తీసుకొస్తానన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి

- త్రికాల శ్రీనివాస్ ముదిరాజ్


విద్యుత్ స్తంభం ఏర్పాటును పర్యవేక్షిస్తున్న త్రికాల శ్రీనివాస్ ముదిరాజ్

రాంగోపాల్‌పేట్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి) : రాంగోపాల్‌పేట్ డివిజన్‌లో నెలకొన్న ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని సనత్‌నగర్ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి డాక్టర్ కోట నీలిమ, ఏ బ్లాక్ అధ్యక్షులు త్రికాల మనోజ్ కుమార్ ముదిరాజ్ సూచనలతో పరిష్కారానికి కృషి చేస్తామని డివిజన్ కాంగ్రెస్ పార్టీ యువ నాయకుడు త్రికాల శ్రీనివాస్ ముదిరాజ్ అన్నారు. ఆదివారం గాస్మండి ప్రాంతంలోని లైబ్రరీ దగ్గరలోని ఫోనిక్ ట్యుటోరియల్స్ వద్ద తుప్పు పట్టి, ప్రమాదకరంగా ఉన్న ఇనుప విద్యుత్ స్తంభాన్ని విద్యుత్ శాఖ జనరల్ బజార్ ఏఈ దృష్టికి తీసుకువెళ్ళి దానిని మార్పించామని తెలిపారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ ముదిరాజ్ మాట్లాడుతూ విద్యుత్ స్తంభం మార్పుకు స్పందించి సహకరించిన సంబంధిత శాఖ ఏడీ, డీఈలకు కృతజ్ఞతలు తెలిపారు.


మొక్కలు నాటుతున్న బీజేపీ నాయకులు

'ఏక్ పేడ్ మా కే నామ్' పిలుపులో భాగంగా మొక్కలు నాటిన నాయకులు

సికింద్రాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ప్రధాని ఇచ్చిన 'ఏక్ పేడ్ మా కే నామ్' పిలుపు మేరకు సికింద్రాబాద్ కంటోన్మెంట్‌లో బీజేపీ నాయకులు మొక్కలు నాటారు. మడ్‌ఫోర్టులోని కంటోన్మెంట్ వర్క్‌షాప్ వద్ద బీజేపీ సికింద్రాబాద్ మహంకాళి జిల్లా అధికార ప్రతినిధి బి.ఎన్.శ్రీనివాస్ ఆధ్వర్యంలో కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద, నాయకులు మాచర్ల శ్రీనివాస్, నీరజ్, కామిని, అరుణ్, మధు, హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

'బీజేపీ విజయానికి శ్రేణులు కృషి చేయాలి'

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాబోయే ఏ ఎన్నికలు జరిగినా బీజేపీ విజయం సాధించడమే లక్ష్యంగా శ్రేణులు కృషిచేయాలని ఆ పార్టీ నేతలు పేర్కొన్నారు. ఆదివారం బీజేపీ అడిక్‌మెట్ డివిజన్ అధ్యక్షుడు పి.సాయికృష్ణయాదవ్ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథులుగా జాతీయ ఓబీసీ మోర్చాకార్యవర్గ సభ్యులు పూసరాజు, బీజేపీ స్టేట్ కౌన్సిల్ మెంబర్ రోయ్యూరు శేషసాయిలు హాజరై మాట్లాడారు. బీసీ జనగణనపై కేంద్ర ప్రభుత్వం చేపట్టినందుకు ప్రధాని మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

362 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు

- ఐటీ కారిడార్‌లో అత్యధికంగా నమోదవుతున్నట్లు వెల్లడి

హైదరాబాద్ సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వారం రోజుల వ్యవధిలో నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్‌లో 362 మందిపై కేసులు నమోదయ్యాయి. ఐటీ కారిడార్ చుట్టు పక్కల ప్రాంతాల్లోనే ఎక్కువ మంది మద్యం తాగి వాహనాలు నడుపుతున్నట్లు తనిఖీల్లో వెల్లడవుతోంది. కమిషనరేట్ పరిధిలో మొత్తం 16 ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌లు ఉండగా, ఆయా స్టేషన్‌ల పరిధిలో ప్రత్యేకంగా నిర్వహించిన తనిఖీల్లో 362 కేసులు నమోదయ్యాయని సైబరాబాద్ పోలీసులు తెలిపారు. తనిఖీల్లో 260 ద్విచక్ర వాహనాలు, త్రిచక్ర వాహనాలు 24, కార్లు 73, 5 భారీ వాహనాల డ్రైవర్లు మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నట్లు గుర్తించామని చెప్పారు. పట్టుబడిన వారిలో బీఏసీ(బ్లడ్ ఆల్కహాల్ కాన్‌సెంట్రేషన్) స్థాయి 35 ఎంజీ/100 ఎల్ నుంచి 200ఎంజీ/100 ఎంఎల్‌గా ఉందని, అదేవిధంగా 30 మందిలో 201ఎంజీ/100 ఎంల్ నుంచి 200ఎంజీ/100ఎంఎల్‌గా ఉందని తెలిపారు. తనిఖీల్లో పట్టుబడిన వారిపై బీఎన్ఎస్ చట్టం 105 సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేసి, కోర్టులో హాజరుపరిచారు. మియాపూర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో అత్యధికంగా 64 మంది, శంషాబాద్‌లో 42 మంది, షాద్‌నగర్, చేవెళ్ల పీఎస్ పరిధుల్లో 32, జీడిమెట్ల పరిధిలో 31 మంది చొప్పున మొత్తం 362 మందిపై డ్రంకెన్ డ్రైవ్ కేసులు నమోదు చేసినట్లు సైబరాబాద్ పోలీసులు వెల్లడించారు. మద్యం మత్తులో వాహనాలను నడపడం ప్రమాదకరమని, తనిఖీల్లో పట్టుబడితే పదేళ్ల వరకు జైలు శిక్షతో పాటు జరిమానా ఉంటుందన్నారు.


ప్యాట్నీ కాంపౌండ్ వద్ద నాలా పూడికతీత పనులు


పద్మావతి కాలనీలో..


బీహెచ్ఈఎల్ కాలనీలో సాగుతున్న పూడికతీత పనులు

వరద ముంపు సమస్య పరిష్కారమే లక్ష్యం

కంటోన్మెంట్‌లో ముమ్మరంగా నాలా పూడికతీత పనులు

సికింద్రాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో నాలా పరివాహక ప్రాంతాలను వరద ముంపు నుంచి రక్షించడమే లక్ష్యంగా సికింద్రాబాద్ కంటోన్మెంట్ యంత్రాంగం అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా రెండు ప్రధాన నాలాలను ఆక్రమించి నిర్మించిన కట్టడాలను హైడ్రా సహకారంతో తొలగించే ప్రక్రియను ఓవైపు ప్రారంభిస్తూనే, మరోవైపు నాలా పూడికతీత పనులను ముమ్మరం చేసింది. ప్యాట్నీ కంపౌండ్ వద్ద నాలాను ఆక్రమించిన కట్టడాలను ఇటీవల నేలమట్టం చేసిన సంగతి విదితమే. అనంతరం ఆ ప్రాంతంలో నాలా పూడికతీత పనులను కంటోన్మెంట్ బోర్డు యంత్రాంగం చేపట్టింది. దీంతో పాటు హస్మత్‌పేట్ నాలా, పికెట్ నాలాల పూడికతీత పనులను వేగంగా చేపడుతోంది. హస్మత్‌పేట్ నాలా బోయినపల్లి ప్రోగ్రెసివ్ కాలనీ, పార్క్‌వ్యూ ఎన్‌క్లేవ్, సేల్ కాలనీ, ధనలక్ష్మి కాలనీ, జయనగర్, చిన్నతోకట్ట, ఎయిర్‌పోర్టు కింద నుంచి రసూల్‌పురా, మార్గదర్శి కాలనీ, బీహెచ్ఈఎల్ కాలనీ, ప్యాట్నీ కంపౌండ్‌ల మీదుగా హుస్సేన్‌సాగర్‌లో కలుస్తోంది. అలాగే పికెట్ నాలా ఎంఈఎస్ కాలనీ, రైల్వే కాలనీ, కృపా అపార్ట్‌మెంట్స్, జేబీఎస్, స్వీకార్ ఉప్‌కార్, జింఖాన మైదానం, బాలంరాయి పంప్, విమాన్‌నగర్, పాయ్‌గాకాలనీ, ప్యాట్నీ కంపౌండ్ మీదుగా హుస్సేన్‌సాగర్‌లో కలుస్తుంది. ఈ రెండు ప్రధాన నాలాలను పూర్తి స్థాయిలో అధ్యయనం చేసిన అధికారులు తాజాగా పూడిక తీత పనులు ముమ్మరం చేశారు.


ధనలక్ష్మి కాలనీలో నాలా పూడికతీత పనులు

నెల రోజుల్లో పూర్తి చేస్తాం

కంటోన్మెంట్‌లోని కాలనీలు, బస్తీలు వరద ముంపు బారిన పడకుండా ఉండేందుకు నాలా పూడికతీత పనులకు శ్రీకారం చుట్టాం. కంటోన్మెంట్ ముఖ్య కార్యనిర్వహణాధికారి డి.మధుకర్ నాయక్ పర్యవేక్షణలో ఈ పనులు వేగంగా జరుగుతున్నాయి. నెల రోజుల్లో పూర్తి చేయాలని లక్ష్యంగా నిర్దేశించుకున్నాం. గతంతో పోలిస్తే ముంపు సమస్య చాలా వరకు పరిష్కారమైంది. అయితే సమస్యను పూర్తిగా పరిష్కరించాలని, ప్రజలకు పూర్తిగా ఉపశమనం కలిగించాలని చూస్తున్నాం. తాజాగా డ్రోన్ కెమెరాల సహకారంతో నాలా పూడికతీత పనులు చేపడుతున్నాం. నాలాల్లో చెత్తాచెదారం వేయకుండా ప్రజలు కూడా మాకు, మా సిబ్బందికి సహకరించాలని కోరుతున్నాం.

- దేవేందర్, కంటోన్మెంట్ శానిటేషన్ సూపరింటెండెంట్


పనులను పరిశీలిస్తున్న కంటోన్మెంట్ సీఈఓ మధుకర్ నాయక్



మాట్లాడుతున్న మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు

ప్రతి ఒక్కరు దేశ భవిష్యత్‌కు పాటుపడాలి

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే ప్రతి ఒక్కరూ దేశ భవిష్యత్ కోసం పాటుపడాలని మహారాష్ట్ర మాజీ గవర్నర్ సీహెచ్.విద్యాసాగర్‌రావు సూచించారు. ఆదివారం సుందరయ్యవిజ్ఞాన కేంద్రంలో కృష్ణప్రసాద్ 21 సెంచరీ ఐఏఎస్ అకాడమి ఆధ్వర్యంలో ఐఏఎస్ ఫలితాలలో టాపర్లకు సన్మాన, సివిల్స్‌కు ప్రిపేర్ అయ్యే విద్యార్థులతో కార్యక్రమాలను నిర్వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ దేశం అభివృద్ధిలో ఐఏఎస్‌ల పాత్ర కీలకమైనదన్నారు. అడిషనల్ డీజీపీ మహేష్ భగవత్ మాట్లాడుతూ ఐఏఎస్ కావడం కోసం ప్రిపేర్ అయ్యే విద్యార్థులు తమకు ఇష్టమైన సబ్జెక్ట్‌ను ఎన్నుకుని ఆ దిశలో సాధన చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో 21వ సెంచరీ ఐఏఎస్ అకాడమి చైర్మన్ కృష్ణప్రదీప్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారులు, ప్రొఫెసర్ జి.గణేష్, డాక్టర్ అనంతపద్మారావు, ఐపీఎస్ రిటైర్డ్ అధికారి కె.పి.డాక్టర్ భవానీశంకర్ పాల్గొన్నారు.

అనధికార లేఔట్స్‌లో నిర్మాణాలకు అనుమతి

- కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద

సికింద్రాబాద్, జూన్ 8(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో అనధికార లేఔట్‌లలో కూడా ఇళ్ల నిర్మాణానికి అనుమతి ఇస్తామని, ప్రజలు బోర్డు కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవచ్చని సికింద్రాబాద్ కంటోన్మెంట్ నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద చెప్పారు. బోయినపల్లి హనుమాన్ జీ కోఆపరేటివ్ సొసైటీలో ఆదివారం రూ.36లక్షల వ్యయంతో చేపట్టిన సిమెంట్ రోడ్డు పనులకు ఆమె శంకుస్థాపన చేశారు. గతంలో సుజాత గుప్తా సీఈఓగా ఉండగా అనధికార లేఔట్‌లలో కూడా నిర్మాణాలకు బోర్డు అనుమతి ఇచ్చిందని, రాబోయే రోజుల్లో కూడా ఇదే పద్ధతిని అమలు చేయనున్నట్టు వెల్లడించారు. రాకేష్, రాయల్‌కుమార్, బాణాల శ్రీనివాస్‌రెడ్డి, బాణుక సుభాష్, సుంకర సత్యనారాయణ, గణపతి పటేల్, శ్రీనాథ్ పణి, చక్రవర్తి, చాంద్ పరీక్, పూజారి సూర్యపాల్, మురళి, రమేష్, హనుమంత్ యాదవ్ పాల్గొన్నారు.


రోడ్డు నిర్మాణ పనులకు శంకుస్థాపన చేసిన బాణుక నర్మద

తాగునీటి ఎద్దడి నివారణకు కృషి

సికింద్రాబాద్, మే 8(ఆంధ్రజ్యోతి): కంటోన్మెంట్‌లో తాగునీటి ఎద్దడి నివారణకు కృషి చేస్తున్నట్టు సికింద్రాబాద్ కంటోన్మెంట్ బోర్డు నామినేటెడ్ సభ్యురాలు బాణుక నర్మద చెప్పారు. రెండో వార్డులోని పైగా, అవంతి కాలనీల్లో నాలాలను, శ్రీలంక బస్తీలో పాడైన బోర్‌వెల్‌ను ఆమె పరిశీలించారు. మార్గదర్శి కాలనీలో వీధి దీపాలు ఏర్పాటు చేయాలని, ఉన్న వీధి దీపాలకు మరమ్మతులు నిర్వహించాలని స్థానికులు కోరారు. అనంతరం ఆమె మాట్లాడుతూ తాజాగా రూ.18లక్షల వ్యయంతో రెండు పైప్‌లైన్ల మధ్య అనుసంధాన పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నామని, దీనివల్ల పైగా కాలనీ, గన్‌బజార్, ఉషా గిడ్డంగులు పరిసర ప్రాంతాల్లో తాగునీటి సరఫరా మెరుగుపడుతుందని వెల్లడించారు. రెండో వార్డు బీజేపీ అధ్యక్షుడు మందుల శ్రవణ్, మాజీ అధ్యక్షుడు అశోక్‌కుమార్, చిట్టిబాబు, అల్వేష్, రాజశేఖర్, అనిల్, పరశురామ్‌యాదవ్ పాల్గొన్నారు.

రాంనగర్ పద్మశాలీ సంఘం అభివృద్ధికి కృషి

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ అంజన్ కుమార్ యాదవ్, ఎమ్మెల్యే గోపాల్


రాంనగర్ పద్మశాలీ సంఘం ప్రారంభోత్సవంలో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తదితరులు

రాంనగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి):రాంనగర్ పద్మశాలీ సంఘం అభివృద్ధి, సభ్యులు, ప్రజల సంక్షేమానికి కృషి చేస్తామని కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, మాజీ ఎంపీ ఎం.అంజన్‌కుమార్‌యాదవ్, ముషీరాబాద్ ఎమ్మెల్యే ముఠా గోపాల్ అన్నారు. ఆదివారం రాంనగర్ రామాలయం వీధిలో నూతనంగా ఏర్పాటు చేసిన రాంనగర్ పద్మశాలీ సేవా సంఘం నూతన కార్యాలయాన్ని వారు ముఖ్యఅతిథులుగా హాజరై, ప్రారంభించి, మాట్లాడారు. పద్మశాలీలు విద్య, ఉద్యోగ, ఆర్థిక, రాజకీయ రంగాలలో రాణించాలని సూచించారు. రాంనగర్ పద్మశాలి సేవా సంఘం నిర్వహించే సేవా కార్యక్రమాలకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమానికి సంఘం అధ్యక్షుడు కోడం బాల్‌రాజ్, అఖిల భారత పద్మశాలీ సంఘం కోశాధికారి కొప్పుల దేవేందర్ అధ్యక్షత వహించారు. ముషీరాబాద్ కార్పొరేటర్ సుప్రియానవీన్‌గౌడ్, సంఘం ప్రధాన కార్యదర్శి పానుగంటి మురళీకృష్ణ నివేదికను సమర్పించారు. ఈ కార్యక్రమంలో అఖిల భారత పద్మశాలీ సంఘం ప్రధానకార్యదర్శి గడ్డం జగన్నాథ్, రాష్ట్ర అధ్యక్షుడు కె.మురళి, పద్మశాలీ సేవా సంఘం రాంనగర్ సలహాదారులు చెరుపల్లి యాదగిరి, కూరపాటి లక్ష్మీనారాయణ, ఉపాధ్యక్షుడు మిరియాల సత్తయ్య, కూరపాటి వెంకటేష్, వల్లకాటి బాబురావు, కార్నాటి శ్రీనివాస్, కందగట్ల రాజు, కందగట్ల శేఖర్, వనం చంద్రమౌళి, యాప్రాం నర్సింహ, సత్యనారాయణ, శ్రీనివాస్, మహిళా అధ్యక్షురాలు జి.రూప, బీఆర్ఎస్ నాయకులు సుధాకర్‌గుప్తా, రవియాదవ్ తదితరులు పాల్గొన్నారు.

లంబాడీలపై కాంగ్రెస్ చిన్న చూపు

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో అత్యధిక జనాభా ఉన్న లంబాడీ సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో స్థానం కల్పించకపోవడం లంబాడీలను అవమానించడమేనని, లంబాడీలను కాంగ్రెస్ పార్టీ చిన్న చూపు చూస్తోందని గిరిజన చైతన్య వేదిక ఓయూ జాక్ చైర్మన్, బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు డాక్టర్ కరాటే రాజు నాయక్ మండిపడ్డారు. ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ లంబాడీల ఓట్లతో అధికారంలోకి వచ్చి లంబాడీలకు మంత్రివర్గంలో స్థానం కల్పించకపోవడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. కాంగ్రెస్ పార్టీలోని లంబాడీ సామాజిక వర్గానికి చెందిన ఎమ్మెల్యేలు, ఎంపీలు, ఎమ్మెల్సీలు తక్షణమే తమ పదవులకు, పార్టీకి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. గిరిజనులకు మంత్రి పదవి భిక్ష కాదు హక్కు అని పేర్కొన్నారు. అందుకే కాంగ్రెస్ పార్టీ హటావో.. బంజారా జాతి బచావో నినాదంతో భవిష్యత్ కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. కేసీఆర్ ముఖ్యమంత్రిగా ఉన్న రెండు సార్లు లంబాడీలకు మంత్రి పదవులిచ్చారని గుర్తు చేశారు.

అక్రమంగా తరలిస్తున్న డిఫెన్స్ మద్యం పట్టివేత

- ఇద్దరు నిందితుల అరెస్ట్
- రూ.2.30 లక్షల విలువైన మద్యం స్వాధీనం


ఎక్సైజ్ పోలీసులు స్వాధీనం చేసుకున్న మద్యం బాటిళ్లు, చిత్రంలో నిందితులు (ముసుగులో ఉన్న వారు)

హైదరాబాద్ సిటీ, జూన్ 8(ఆంధ్రజ్యోతి): ఇతర రాష్ట్రాల నుంచి అక్రమంగా తరలించి నగరంలో విక్రయిస్తున్న నాన్‌డ్యూటీ పెయిడ్ లిక్కర్‌పై ఎక్సైజ్ పోలీసులు ఉక్కుపాదం మోపుతున్నారు. అక్రమంగా విక్రయిస్తున్న లిక్కర్‌ను సీజ్ చేస్తున్నారు. ఈ క్రమంలో డిఫెన్స్ (ఆర్మీ) మద్యాన్ని అక్రమంగా తరలించి గుట్టుగా విక్రయిస్తున్న ముఠాను ఆదివారం ఎక్సైజ్ ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి కారు సహా.. రూ. 2.30లక్షల విలువైన 115 బాటిళ్ల డిఫెన్స్ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. ఎక్సైజ్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. డిఫెన్స్ క్యాంటీన్ నుంచి తీసుకొచ్చిన మద్యాన్ని శేరిలింగంపల్లి హఫీజ్‌పేట్ మీదుగా అక్రమంగా తరలిస్తున్నట్లు విశ్వసనీయ సమాచారం అందుకున్న శంషాబాద్ సీఐ ప్రవీణ్ కుమార్ సిబ్బందితో కలిసి దాడిచేశారు. కారులో మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 2.30లక్షల విలువైన మద్యం స్వాధీనం చేసుకున్నారు. చాకచక్యంగా వ్యవహరించి నాన్ డ్యూటీ పెయిడ్ లిక్కర్‌ను అడ్డుకున్న సీఐ ప్రవీణ్‌కుమార్, ఎస్ఐ శ్రీకాంత్ రెడ్డి టీమ్‌ను ప్రోహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ డైరెక్టర్ షానవాజ్ ఖాసీం, డిప్యూటీ కమిషనర్ దశరథ్ అభినందించారు.

కుషాయిగూడలో మహిళ అదృశ్యం

ఏఎస్‌రావునగర్, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): ఇంటి నుంచి బయటకు వెళ్లిన ఓ మహిళ అదృశ్యమైన సంఘటన కుషాయిగూడ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి.కాప్రా గౌరినాథపురంకు చెందిన కాటం కల్యాణి ఏఎస్‌రావునగర్‌లో ఓ బట్టల షాపులో పనిచేస్తుంది. ఈ నెల 7న ఉదయం 10.30 గంటలకు పని కోసం ఇంటి నుంచి వెళ్లిన కల్యాణి రాత్రి అయినా తిరిగి రాలేదు. ఆందోళనకు గురైన భర్త ఎల్లేష్ ఆమెకు ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ వచ్చింది. దీంతో సదరు బట్టల షాపునకు వెళ్లి వాకబు చేయగా ఏడున్నరకే షాపు నుంచి వెళ్లిపోయిందని యాజమాన్యం సమాధానం చెప్పారు. బంధు, మిత్రుల ఇళ్లలో వాకబు చేసినా ఫలితం లేకపోవడంతో చేసేది లేక ఆదివారం కుషాయిగూడ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు ప్రారంభించారు.

'వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి హర్షణీయం'

ఉస్మానియా యూనివర్సిటీ, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): మాల సామాజిక వర్గం నుంచి వివేక్ వెంకటస్వామికి మంత్రి పదవి ఇవ్వడం హర్షణీయమని ఓయూ ఆల్ మాల స్టూడెంట్ అసోసియేషన్ అధ్యక్షుడు నామ సైదులు అన్నారు. ఆదివారం ఉస్మానియా యూనివర్సిటీలోని ఆర్ట్స్ కాలేజీ ఆవరణలో స్వీట్లు పంపిణీ చేసి బాణ సంచా కాల్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మాల సామాజిక వర్గానికి మంత్రి వర్గంలో చోటు కల్పించిన సీఎం రేవంత్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. భవిష్యత్‌లో కూడా మాలలకు సముచితమైన స్థానం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో మాల విద్యార్థి సంఘం నాయకులు మదునూరి రాహుల్, ఎనపోతుల అరుణ్ కుమార్, డి.రేణయ్య, కృష్ణ, ధనుంజయరాజు, రవి, ప్రేమ్, నరేష్ ప్రవీణ్ పాల్గొన్నారు.


కుండలపై అద్భుతంగా నృత్యం చేస్తున్న చిన్నారులు

యోగాతోనే సంపూర్ణ ఆరోగ్యం : నరేంద్ర బంధు

బేగంపేట, జూన్ 8 (ఆంధ్రజ్యోతి): యోగా ద్వారానే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని నిర్మల సాధన జ్యోతి మందిర్ వ్యవస్థాపకులు, యోగా గురువు నరేంద్ర బంధు అన్నారు. నిర్మల్ సాధన జ్యోతి మందిర్ భగత్‌సింగ్ పార్క్ బ్రాంచ్ వార్షికోత్సవాలు సనత్‌నగర్‌లోని భగత్‌సింగ్ పార్క్‌లో ఆదివారం ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నరేంద్ర బంధు దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఉదయం పార్కులో యోగాసనాలు వేశారు. అనంతరం చిన్నారులు చేసిన నృత్యాలు అందరినీ అబ్బురపరచాయి. ప్రధానంగా చేతుల్లో క్యాండిల్ దీపాలు పెట్టుకొని కుండలపై నృత్యాలు చేస్తూ చేసిన నృత్యాలు అందరినీ కట్టిపడేశాయి. ఈ సందర్భంగా యోగా గురువు మాట్లాడుతూ, యోగాను ప్రతీ ఒక్కరూ నేర్చు కోవడంతో పాటు ఇతరులకు ఉచితంగా నేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో బ్రాంచ్ కో-ఆర్డినేటర్ చంద్రశేఖర్, ఇన్‌చార్జి తిలోక్‌నాథ్, యోగా టీచర్లు మాధురి, ప్రసాద్, భూషణ్, యోగేష్ పాల్గొన్నారు.


యోగా సాధన కార్యక్రమంలో పాల్గొన్న యోగా గురువు నరేంద్ర బంధు